# లవ్ స్టోరీ

## పయనమయే ప్రియతమా

చూస్తుండగానే ఇరవై ఏళ్ళు గడిచిపోయాయి.

ఈ ఇరవై ఏళ్ళలో కొత్త మనుషులతో పరిచయాలు, కొత్త సంఘటనల అనుభవాలు ఎన్నో ఎదురయ్యాయి. కాని నేను మాత్రం ఇరవై ఏళ్ళప్పటి మధు లాగే వుండిపోయాను.

అప్పటి నా అనుభూతులు, భావాలు, అనుభవాలు నాలో అలాగే వున్నాయి. పైకి గంభీరంగా వున్నా నాలో నాకు మాత్రమే తెలిసిన మరో వ్యక్తి వున్నాడు. ఇన్నేళ్ళయినా నాలో మార్పు రాలేదు. నేనిపుడు సమాజంలో పెద్ద బిజినెస్ మాగ్నెట్‌ను.

కారు, బంగళా, హోదా–ఒక మనిషి కోరుకునే అన్ని హంగులూ ఉన్నాయి నాకిపుడు. కాని లేనిదొకటే మనశ్శాంతి.

రోజూ నిద్ర పోవడానికి బెడ్ మీదికి చేరడం, అస్థిమితంగా, అశాంతిగా అటు దొర్లి, ఇటు దొర్లి ఏ అర్థరాత్రికో నిద్రలోకి జారిపోవడం, దాదాపుగా ప్రతి రాత్రి ఇలాగే గడిచిపోతుంది. తల తిప్పి పక్కకు చూశాను. ప్రశాంతంగా నిదురపోతూంది నా భార్య అపూర్వ. క్షణ కాలం ఆమె మీద అసూయ అనిపించింది నాకు, ఇంత నిశ్చింతగా ఎలా నిదిరిస్తుందోనని. ఆ తరువాత నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది నేను చిన్నగా నిట్టూర్చి పక్కమీది నుండి లేచి బాల్కనీలోకి వచ్చాను.

అంతా చీకటి. ఆకాశ స్తంభానికి ఆనుకుని శాండిలియర్ దీపాల్లా వేలాడుతున్న నక్షత్రాలు. పండు వెన్నెలను వెదజల్లే చందమామ. ఉండి ఉండి వీస్తున్న గాలి మొహాన్ని చల్లగా స్పర్శిస్తోంది. ఆ గాలికి ఆహ్లాదంగా వూగుతున్న చెట్లు వింత శబ్దాన్నిస్తున్నాయి. ముచ్చటగా నాటుకున్న నైట్ క్వీన్ మొక్కల నుండి వింత పరిమళం వస్తోంది.

ఇలాంటి ప్రకృతిని చూసినపుడే నాలో భావుకత ఉప్పొంగుతుంది. నేను గొప్ప భావుకుణ్ని కాదు. కాని నాలో భావుకత లేదని మాత్రం చెప్పలేను. గంటల కొద్దీ కూర్చుని ప్రకృతిని ఆస్వాదించడమంటే నాకెంతో ఇష్టం.

రివ్వున ఒక గాలి తెర నా మొహాన్ని లాగి కొట్టింది. విసురుగా మంచుముద్ద వచ్చి మొహానికి తాకినట్టు క్షణకాలం ఉక్కిరి బిక్కిరి అయ్యాను. మళ్ళీ మామూలే.

జ్ఞాపకాలు హృదయానికి అయిన గాయాన్ని ఇంకా పచ్చిగా కెలుకుతూనే వున్నాయి. తలపుల అలలు ఇంకా మనసు ఒడ్డును తాకుతూనే వున్నాయి.

చిత్రం! ఇన్నేళ్ళు గడచినా తాను జాహ్నవిని మరచిపోలేదు. ఆ మరుపే వస్తే తనిపుడు ఈ అర్థరాత్రి పూట బాల్కనీలో ఒంటరిగా వుండేవాడే కాదు. కనులు మూసినా, తెరచినా ఇంకా జాహ్నవి రూపమే నా కళ్ళలో కదలాడుతోంది.

రోజూ బిజినెస్ వ్యవహారాలలో తలమునకలయివున్నా కూడా జాహ్నవిని మరచిపోయిన క్షణమంటూ నా జీవితంలో లేదనే చెప్పాలి.

"ఇన్నాళ్ళు నీ కోసం ఎదురు చూశాను మధు. కాని దురదృష్టవంతురాలిని" వెడ్డింగ్ కార్డు చేతిలో పెట్టి అన్న జాహ్నవి మాటలు ఇంకా నాలో అలజడిని రేపుతున్నాయి. జ్ఞాపకాల సుడిగుండంలోకి విసిరికొడుతున్నాయి.

బి.ఎ. అయిపోగానే పి.జి.లో జాయిన్ అయ్యాను. కాలేజికి వెడదామని బస్ స్టాప్‌లో నిల్చున్నాను. ఎంతకీ బస్ రావడంలేదు. అసహనంగా చూస్తున్నాను. ఇంతలోనే రివ్వునగాలి. ఒక పల్చని తెర నా మొహాన్ని గాఢంగా హత్తుకుంది. కాసేపు ఉక్కిరి బిక్కిరి అయ్యాను, ఏమయిందో అర్థం కాక నెమ్మదిగా తెర తొలగిపోయింది. పక్కకు చూశాను.

"ఐ యామ్ సారీ" గాలికి ఎగురుతున్న చీర కొంగును దగ్గరకు పట్టుకుంటూ అంది ఆమె. మెరుస్తున్న కాటుక కళ్ళు. చక్కని నాసిక. సున్నా చుట్టినట్టున్న నోరు. తళుక్కుమంటున్న ముక్కెరతో, ఎర్రని బొట్టుతో, సన్నగా, పొడుగ్గా, అద్భుతమైన అందంతో....ఓహ్ తల దిమ్మెక్కింది నాకు. చూపు మరల్చుకోకుండా ఆమెనే చూస్తున్నాను.

బస్ వచ్చింది. ఆమె ఎక్కింది. నేనూ ఎక్కాను. చెదిరిన మనసుతో కాలేజీకి చేరి క్లాస్‌లో కూర్చున్నాను. చిత్రంగా ఆమె నా క్లాస్‌లోకే వచ్చింది. క్లాస్‌లో వున్నానన్న మాటే కాని నా చూపంతా ఆమె మీదే.

వలపు పర్వతం పగిలి ప్రేమ లావా నాలో పొంగింది ఆ రోజే.

లైబ్రరీలో కూర్చున్నాను ఒక రోజు.

"హలో"

ఉలిక్కిపడ్డాను. ఎదురుగా ఆమె.

ఎన్నెన్నో భావాలు ఉప్పొంగగా ఏ భావాన్నీ ప్రకటించలేక అలాగే భావరహితంగా చూశాను ఆమె వైపు.

"కాస్త పేపరిస్తారా" అడిగింది.

నా చేతిలోని పేపర్ ఇచ్చాను. తీసుకుని పక్కనే కూచుని చదవసాగింది. స్వతహాగా నేను పిరికివాడిని. కొత్తవారితో మాట్లాడాలంటే మొహమాటం నాకు. ఇక ఆడవారితో అయితే చెప్పనే

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 18-10-91



అక్కర్లేదు. అందుకే రిజర్వ్‌డ్‌గా వుండడం అల వాటయింది.

"మీ పేరు" కాసేపు తరువాత పేపరు పక్కకు పడేసి అడిగింది.

"మధు" చెప్పాను. "నా పేరు జాహ్నవి. ఎం.ఎ. సోషియాలజీ. మీ క్లాసే" నేను అడ గకుండానే చెప్పింది. నేనేమయినా మాట్లాడ తాననుకుందో ఏమో. నేనేమీ అనలేదు.


"వెళుతున్నాను" చెప్పి వెళ్ళిపోయింది. నేను ఆమె కనుమరుగయ్యే వరకు చూస్తుండిపోయాను. ఆ తరువాత ఆమె నాకొక స్నేహితురాలయింది.

నాలో ఉప్పొంగే ప్రేమ సముద్రాన్ని అక్షర రూపంలోకి మార్చి డైరీలో దాచుకునేవాడ్ని. కాని ఆమెకు చెప్పాలని అనుకోలేదు.

నీరవ నిశీధి కమ్ముకున్న అర్ధరాత్రుల్లో స్తబ్దత పేరుకున్న చిక్కటి చీకట్లో వేదంలా పరచు కున్న వెన్నెల్లో ఒంటరిగా కూర్చుని డైరీ వ్రాస్తూ అనిర్వచనీయమైన అనుభూతిని పొందేవాడ్ని.

"రాత్రుళ్ళూ పగళ్ళూ గడచిపోతున్నాయి
యుగ యుగాలే పూవులుగా పూచి
వాడిపోతున్నాయి
ఇంకా......నువ్వు......అలాగే......
నేను......ఇలాగే......
రోజులు, ఋతువులు మారుతున్నాయి
క్షణాలే యుగాలుగా గడుస్తున్నాయి
అయినా.....నువ్వు.....అక్కడే
నేను.....ఇక్కడే
ఇంకా రావేం ప్రియతమా!
నా యెద పానుపుపై వాలి
కౌగిలి దుప్పటి కప్పుకుని
నువ్వు, నేనూ అనే
బహువచనాన్ని చెరిపి
'నేనే' అనుకునేలా
ఒక్కసారి ఒదిగిపో ప్రియా!"

ఇలాగే సాగేది నా రోజు వారీ డైరీ. నా ప్రేమను తెలియ చేద్దామని చాలా సార్లు అనుకున్నాను. కాని అప్పటికే జాహ్నవి చుట్టూ తిరిగే మగవాళ్ళ సంఖ్య పెరిగింది. జాహ్నవి వారిని పట్టించుకునేది కాదు. "నేను నిన్ను స్నేహితునిగానే భావించాను" అని నా ప్రేమను తిస్కరిస్తే అది భరించడం నా వల్ల కాదు. ఆ భయమే నన్ను కట్టి పడేసింది. నా ప్రేమను నాలోనే దాచుకుని అస్థిమితంగా అసహజంగా అశాంతిగా ఆవేదనగా రోజులు గడిపేవాణ్ని.




"మీరు చాలా తక్కువగా మాట్లాడతారెందు" అడిగింది జాహ్నవి ఒకనాడు.

బదులుగా నవ్వి ఊరుకున్నాను.

"ఒక స్నేహితురాలిగా చెబుతున్నాను. ఈ సమాజంలో వేగంగా ముందుకు దూసుకు పోవాలంటే ఫాస్ట్ కారెక్టర్ కావాలి. మీలా సాఫ్ట్‌గా ఉండకూడదు" చెప్పింది.

"ప్రయత్నిస్తాను" అన్నాను.

మరొకనాడు క్యాంటీన్‌లో ఒక్కడినే కూర్చున్నాను. దిగులుగా వచ్చింది జాహ్నవి. నా గుండెనెవరో పిండినట్టయింది.

"అలా ఉన్నారేంటి" ఆదుర్దాగా అడిగాను.

"నా మ్యారేజ్ సెటిలయింది" చెప్పింది.

అంతే, మెదలో అణుబాంబుల వర్షం. మెదడు అరలో ఫెటేల్మన్న విస్ఫోటనం! హృదయంలో ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవుతున్నా పైకి మాత్రం స్తబ్ధుగా ఉండిపోయాను.

"ఇన్నాళ్ళూ నీ కోసం ఎదురుచూసాను మధు. కాని దురదృష్టవంతురాలిని. నేనంటే నీకిష్టం లేదు కదూ!" వెడ్డింగ్ కార్డ్ చేతిలో పెడుతూ అంది జాహ్నవి.

అప్పుడు కలిగింది నాలో పంచలనం. అంటే జాహ్నవి కూడా నన్ను ప్రేమిస్తోంది. ఆ ఆలోచనే నన్ను నిలువెల్లా వణికించింది. ఇప్పుడేం చేయాలి? ఒక అమ్మాయి కళ్ళలోని భావాలను అర్థం చేసుకోనందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. మగాడిని నేనే ధైర్యం చేసి చెప్పనప్పుడు ఆడపిల్ల ఆమెలా చెపుతుంది "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని. నా మీద నాకే కోపం, కసి, అసహ్యం, జుగుప్స అన్నీ కలిగాయి. పిరికి వాళ్ళకు ప్రేమించే హక్కు లేదు అన్నారెవరో నిజమేననిపించింది నాకు.

"జాహ్నవీ" పిలిచాను.

ఏమిటన్నట్టు చూసింది.

"ఐ లవ్ యూ" గుండె గొంతుకతో కొట్లాడి ఎలాగో నా నుండి బయటకి వచ్చింది ఆ మాట. నిర్వేదంగా చూసింది నా వైపు జాహ్నవి.

జాహ్నవి మొహాన్ని చేతుల్లోకి తీసుకుని అప్యాయతా, అనురాగాలకు నిలయమయిన నుదుటన సున్నితంగా నా పెదవులను అద్దాను.

జాహ్నవి కన్నుల నుండి జలజల కన్నీళ్ళు రాలాయి.

"నేనెక్క వలసిన బండి ఒక జీవిత కాలం లేటయింది నేస్తం" అని గిరుక్కున నేను తిరిగి వెళ్ళిపోయింది.

అదే ఆఖరు నేను జాహ్నవిని చూడడం.

ఆ రోజు రాత్రి డైరీలో ఇలా వ్రాసుకున్నాను.

"ప్రియతమా...నా కంటిలో పాపవై నా హృదయంలో ఊపిరివై నా అధరాలపై చిరునవ్వువై, నా పెదాలపై పదానివై నా అణువణువులో నువ్వే నిండి వుంటావు. ఇంకెందుకనుకుంటాను నీవు నాకు దూరమయ్యావని. నీవు నాలోనే వున్నావన్న ఊహ చాలదూ నేను జీవించడానికి! నీ జ్ఞాపకాల ఆలంబన చాలదూ ఎన్ని యుగాలయినా బ్రతకటానికి" అని.

ఫైనలియర్ పరీక్షలు కూడా వ్రాయలేదు జాహ్నవి. నేను పరీక్షలయిపోగానే మా వూరికి వెళ్ళిపోయాను. ఉద్యోగం వేటలో అలసిపోయి కాస్త పెట్టుబడి పెట్టి చిన్న వ్యాపారం ప్రారంభించాను. అదృష్టం కలిసొచ్చి లాభాలు రావడంతో సమాజంలో పెద్ద మనిషినయ్యాను.

నేను పెళ్లి చేసుకోవాలని ఏనాడూ అనుకోలేదు. తల్లిదండ్రుల బలవంతం మీద అపూర్వను చేసుకున్నాను. కాని జాహ్నవికి అంకితమయిపోయిన నా హృదయాన్ని మాత్రం వెనక్కి తీసుకోలేక పోయాను.

ఎలా తీసుకుంటాను.
నాలోని జీవం జాహ్నవి
నాలోని రాగం జాహ్నవి
నాలోని భావం జాహ్నవి
నాలోని భాష్యం జాహ్నవి

నెమ్మదిగా చీకటి పలుచనవుతూంది. తూరుపు వాకిట తొలి కిరణాలు సన్నగా పరుచుకుంటున్నాయి. మంచు చెట్ల మీద పడి చిట్లిపోతూంది. ఎక్కడో కోయిల కూస్తోంది.

నేనింకా బాల్కనీలోనే నిల్చున్నాను. నా చేతిలో పాత డైరీ. తెరిచి చూసాను. పాల నురుగు లాంటి తెల్లని పేపర్ మీద ఎప్పుడో నేను వ్రాసుకున్న గులాబీ రంగు అక్షరాలు.

"ప్రేమ ఒక తీయని కల
అది పెరిగి విరిగిన అల" ★

రచయిత్రి చిరునామా

పెరుమండ్ల శ్రీదేవి
H.NO:10-7-98
రాయవారివీధి,, గిర్మాజీపేట
వరంగల్

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్